సాక్షి పెద్దపల్లి

శనివారం । 14 । అక్టోబర్ । 2023

పూల జాతర

పుట్టింటికి వచ్చిన ఆడపడుచుల్లా..
రెక్కలు విచ్చిన సీతాకోకచిలుకల్లా..
కరుణించి కాపాడే అమ్మవారిలా..
'బతుకమ్మ'రానే వచ్చింది..
ఊరూవాడా భక్తిప్రపత్తులు నింపనుంది..
శనివారం 'ఎంగిలిపూల' వేడుకలు
ప్రారంభంకానున్నాయి.
సద్దుల బతుకమ్మతో సంబురాలు
ముగియనున్నాయి.



న్యూస్‌రీల్

పెండింగ్ సీఎమ్మార్‌పై దృష్టి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: వానాకాలం సీఎమ్మార్ డెలివరీపై శ్రద్ధ చూపాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. సీఎమ్మార్ పెండింగ్ ఉన్న మిల్లులకు 2023–24 వానాకాలం ధాన్యం కేటాయించబోమన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఎం శ్రీకాంత్‌రెడ్డి, రైస్ మిల్లర్లతో పెండింగ్ సీఎమ్మార్‌పై సమీక్షించారు. అధిక సీఎమ్మార్ బాకీ ఉన్న తొలి10 మంది మిల్లర్లు గడువులోగా డెలివరీ పూర్తిచేయాలన్నారు. రైస్‌మిల్లర్లు నవంబర్ 30లోగా సీఎమ్మార్ డెలివరీ పూర్తిచేయాలని సూచించారు. సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లి డీసీపీ బదిలీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్‌ను నాగర్ కర్నూలుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గైక్వాడ్.. జిల్లాలో అసాంఘిక శక్తులను కట్టడి చేయడంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయడంలో సఫలీకృతమయ్యారు. కాగా, ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ డీసీపీగా నియమించలేదు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



తలపడుతున్న పెద్దపల్లి- సుల్తానాబాద్ జట్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఎస్జీఎఫ్ అండర్–14, 17 బాలబాలికల జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. డీఈవో మాధవి పోటీలు ప్రారంభించారు. పెద్దపల్లి, రామగుండం, మంథని, సుల్తానాబాద్ జోన్లకు చెందిన సుమారు 300 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చూపిన జిల్లాజట్టును ఈనెల 16న రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో నిర్వహించే ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీధర్‌రావు, ఎస్జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి అంతటి శంకరయ్య, జోన్ కార్యదర్శులు సంధ్యారాణి, మాధురి లక్ష్మణ్, కడారి రవి, దాసరి రమేశ్, సురేందర్, కందుకూరి ప్రకాశరావు, అమ్మిరిశెట్టి తిరుపతి, కుమార్ కిశోర్, తుమ్మ రాజ్‌కుమార్, జిలాని పాల్గొన్నారు.

హమాలీలకు దసరా బోనస్

పెద్దపల్లిరూరల్: జిల్లా పౌర సరఫరాల సంస్థలోని హమాలీలకు శుక్రవారం దసరా బోనస్ చెక్కులను అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అందజేశారు. సివిల్ సప్లయి స్టాక్ పాయింట్లలో పనిచేసే 79 మంది హమాలీలు, ముగ్గురు స్వీపర్లకు రూ.6,500 చొప్పున ఆయన అందించారు. అలాగే ప్రతీ హమాలీ, స్వీపర్‌కు రూ.800 చొప్పున మిఠాయిల కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత పాటించాలి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ(సిమ్స్)లోని పలు విభాగాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేయడానికి వారధి ద్వారా నోటిఫికేషన్ జారీచేశారని, ఉద్యోగాల కల్పనలో అధికారులు పారదర్శకత పాటించాలని ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ శుక్రవారం డిమాండ్ చేశారు. కొందరు ప్రజా ప్రతినిధులు, కాలేజీ అధికారులు తమకు అనుకూలంగా ఉన్నవారికి ఉద్యోగాలు ఇప్పించే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎంప్లాయ్‌మెంట్ అధికారితోపాటు ఇతర శాఖల అధికారుల నేతృత్వంలో ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని ఆయన కోరారు.

'బీఆర్‌ఎస్ తీరు సరికాదు'

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం సమ్మె చేసినా.. సీఎం కేసీఆర్ సహా పాలకులు స్పందించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించేందుకు కార్మికులు ముందుకు రావాలని కోరారు. నాయకులు కుమారస్వామి, జ్యోతి, గణేశ్, వెంకటస్వామి, కొమురయ్య పాల్గొన్నారు.

అధినేతల జోరు



ఉమ్మడి జిల్లాలో ప్రచారం ప్రారంభించనున్న నేతలు

- 15న హుస్నాబాద్, 17న సిరిసిల్లకు సీఎం కేసీఆర్
- హుస్నాబాద్ సభలోనే పార్టీ మేనిఫెస్టో వివరాల వెల్లడి
- 16న హుజూరాబాద్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- 18న జగిత్యాలకు రాహుల్, ప్రియాంక, కరీంనగర్‌కు కేటీఆర్
- కాంగ్రెస్ బస్సు యాత్ర అదేరోజు ప్రారంభం
- అర్వింద్ పర్యటనతో జగిత్యాల బీజేపీలో కొత్త ఊపు

జంగ్ తెలంగాణ



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో ఎన్నికలవేడి రాజుకుంటోంది. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతల పర్యటనల తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 15న పార్టీ ముఖ్య నేతలందరూ ఎన్నికల సమరశంఖం పూరించేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్, బీఎస్పీ తెలంగాణ చీఫ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పర్యటించనున్నారు.

సీఎం సభతో మొదలు..

అభ్యర్థుల ప్రకటన మొదలు ప్రచారంలో ముందున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రచారాన్నీ ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 15న ఉదయం ప్రగతిభవన్‌లో ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ-ఫారాలను అందజేస్తారు. అతర్వాత పార్టీకి ఎంతో కీలకమైన మేనిఫెస్టోను అక్కడే రిలీజ్ చేస్తారు. అనంతరం హుస్నాబాద్ బయల్దేరుతారు. పార్టీకి సెంటిమెంట్‌గా వస్తున్న హుస్నాబాద్ సభలోనే మేనిఫెస్టోలోని హామీలు రాష్ట్ర ప్రజలకు వివరిస్తారు. హుస్నాబాద్ జనసమీకరణ బాధ్యతలు కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్న అనిల్‌గౌడ్‌కు అధిష్టానం అప్పగించింది. 17న సిరిసిల్ల, వచ్చేనెల 3న కోరుట్ల, 7న పెద్దపల్లి, మంథనిలో జరిగే సభల్లో సీఎం మాట్లాడుతారు.

18న గంగుల ప్రచారంలో కేటీఆర్

ఈనెల 18న మంత్రి గంగుల కమలాకర్ ప్రచారం ప్రారంభించ నున్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సిరిసిల్ల నుంచి రానున్న కేటీఆర్‌కు మంత్రి గంగుల కమలాకర్ పార్టీ శ్రేణులు స్వాగతం పలుకుతారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించి, భారీ ఊరేగింపుతో సభా ప్రాంగణానికి వెళ్తారు. అక్కడ కేటీఆర్ ప్రసంగిస్తారు. క్రమంగా మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ కేటీఆర్ పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర..

జగిత్యాల జిల్లా కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రారంభించనుంది. ఇందు కోసం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ రానున్నారు. కాంగ్రెస్ జిల్లాల పర్యటనకు ఉద్దేశించిన బస్సు పర్యటనలు విజయవంతం కావాలని కోరుతూ కొండగట్టు అంజన్న ఆశీర్వాదాలు తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే 18న రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ జగిత్యాలకు రానున్నారు. పార్టీ అగ్రనేతలతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ లీడర్లు ప్రచారం ముమ్మరం చేయనున్నారు.

రాజ్‌నాథ్, బండి, అర్వింద్..

బీజేపీలో జోష్ నింపేందుకు బీజేపీ అగ్రనాయకత్వం కేంద్ర నాయకులు, కేంద్రమంత్రులు ఉమ్మడి జిల్లాకు రానున్నారు. ఈనెల 16న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హుజూరాబాద్‌లో ప్రచారం ప్రారంభించనున్నారు. కరీంనగర్ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కూడా రాజ్‌నాథ్ పర్యటన అనంతరం కరీంనగర్‌లో ప్రచారం స్టార్ట్ చేస్తారని సమాచారం. ఇక కోరుట్ల అసెంబ్లీ స్థానంపై కన్నేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం పర్యటన పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. వీరితోపాటు బీఎస్పీ అభ్యర్థులకు మద్దతుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సైతం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు.

కార్మికుల ఓట్లే కీలకం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రచారం ఇలా.. దుస్తులు కుడుతున్న రాజ్‌ఠాకూర్

- అన్నిపార్టీల దృష్టి వారిపైనే
- కుటుంసభ్యుల వివరాలు సేకరణ
- మచ్చిక చేసుకునేందుకు యత్నాలు

సాక్షి, పెద్దపల్లి: రామగుండం.. పారిశ్రామిక ప్రాంతం.. కార్మిక క్షేత్రం.. ఇక్కడి రాజకీయాలను చాలావరకు కార్మికులే శాసిస్తారు.. అందుకే ఇప్పుడు ఈప్రాంతంలో పోటీచేసే అభ్యర్థులు వారిఓట్ల కోసం పడరానిపాట్లు పడుతున్నారు. రామగుండం, మంథని నియోజకవర్గాల్లో సింగరేణి ఓటుబ్యాంకు.. అభ్యర్థుల విజయవకాశాలపై తీవ్ర ప్రభావం చూపించనుంది. ముఖ్యంగా రామగుండం నియోజకవర్గంలో సింగరేణితోపాటు ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, జెన్‌కో, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీల్లో పనిచేసే పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల ఓట్లు అధికంగా ఉన్నాయి. వారి ఓట్లు గంపగుత్తగా పొందేందుకు వివిధ పార్టీల నేతలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.

కార్మికుల చెంతకు నాయకులు

- సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల కార్మికశాఖ ప్రయత్నాలు చేసినా.. సింగరేణి, కార్మిక సంఘాల నాయకులు కొందరు సుముఖత చూపలేదు. దీంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.
- అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో వారిఓట్లు కీలకం కావడంతో పాటు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నిర్వహించే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై ఆ ప్రభావం తీవ్రంగా పడే అవకాశం ఉంది.
- దీంతో అన్నిపార్టీలు, వాటి అనుబంధ కార్మిక సంఘాలు అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి.
- సింగరేణి అన్నిఏరియాల్లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నారు.
- కాంగ్రెస్, బీజేపీలు కార్మికుల ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ ముందుకు సాగుతున్నాయి.
- ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ నాయకులు కూడా ప్రచార సన్నాహాల్లో నిమగ్నమయ్యారు.

కార్మికు సంఖ్య (సుమారు)	
సింగరేణి	11,500
కాంట్రాక్టు	6,000
ఎన్టీపీసీ	3,500
ఆర్‌ఎఫ్‌సీఎల్	750
జెన్‌కో	1,000

లెక్కలు తీస్తున్నారు..

కార్మికుల ఓట్లు కీలకం కావడంతో వారి వివరాలు సేకరించే పనిలో నేతలు బిజీబిజీగా గడుపుతున్నారు. కార్మికులు ఎందరు? వారి కుటుంబ సభ్యులు ఎందరు? అనే వివరాల సేకరణలో ఆయా పార్టీల శ్రేణులు నిమగ్నమయ్యారు. ఆయా వర్గాల నేతలను మచ్చిక చేసుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వారిని ఆకట్టుకునేందుకు తాయిలాలు ఇచ్చేందుకు నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అందరూ కలిసి రామగుండం నియోజకవర్గంలో సుమారు 60వేల మంది ఉండవచ్చని, వారందరినీ తమవైపు తిప్పుకుంటే విజయం సునాయాసం అవుతుందని నేతలు భావిస్తున్నారు.

రూ.26లక్షల నగదు స్వాధీనం



పట్టుకున్న నగదుతో అధికారులు

జ్యోతినగర్(రామగుండం): జిల్లావ్యాప్తంగా శుక్రవారం పోలీసులు చేసిన తనిఖీల్లో సుమారు రూ.26.33లక్షల నగదు పట్టుబడింది. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులో రోజువారీ తనిఖీల్లో గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన జ్యూయెలరీ వ్యాపారి నిరంజన్‌రెడ్డి వద్ద రూ.15.30లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం–3 (ఎఫ్ఎస్‌టీ) అధికారి త్రయంబకేశ్వరావు, ఎన్టీపీసీ ఎస్సై జీవన్, హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుళ్లు సామ్రాట్, కిరణ్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీలు చేస్తున్నామన్నారు.

కాలనీలో రూ.6లక్షలు..

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీసులు తనిఖీలు చేశారు. స్థానిక షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా అంబేడ్కర్ చౌరస్తా వద్ద రెండో సీఐ అఫ్జలొద్దీన్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. కాలనీకి చెందిన రాజ్‌మహమ్మద్ అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడి బైక్ తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని రూ.6లక్షలు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గుంపుల చెక్‌పోస్ట్ వద్ద రూ.2.50లక్షలు..

ఓదెల(పెద్దపల్లి): జిల్లాసరిహద్దు గుంపుల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా రూ2.50 లక్షల నగదు లభించిందని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

రామగిరి: ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో పన్నూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద ఆధారాలు లేకుండా రూ. 2,53,460 నగదు తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో ఆ నగదు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్, పార్టీ శ్రేణులు

- డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం స్థానిక 25వ డివిజన్‌లో ప్రజాదీవెన యాత్ర కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్ అంటూ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రజలను గోసపెట్టిన ప్రభుత్వానికి ఘోరీ కట్టాలని ఆయన కోరారు. రెండు దశాబ్దాలుగా ఈప్రాంత సమస్యలపై పోరాటం చేస్తున్న తనకు ఈసారి అవకాశం ఇవ్వాలని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చేతిగుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రెండు గ్రామాల నుంచి చేరికలు

సోమనపల్లి, మురుమూరు గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రామగుండంలో బీఆర్‌ఎస్‌పై విసుగుచెంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ముర్మూర్ మాజీ సర్పంచ్ గోపు కొమురయ్య, నూతి శ్రీనివాస్, నంకటి మహేశ్‌కుమార్, జూల రవి, రమేశ్‌తో పాటు 200 మంది మహిళలు, సోమనపల్లి గ్రామానికి చెందిన 20 మంది రైతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఉరిమెట్ల రాజలింగం, బీసీ సెల్ అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, సోమనపల్లి మాజీ సర్పంచ్ గుంట బాబు, అంతర్గాం మాజీ సర్పంచ్ కమ్మని కొమురెల్లి, బ్రాహ్మణపల్లి మాజీ ఎంపీటీసీ చల్లా రవీందర్, నాయకులు గజేల్లి శంకర్, హనుమాన్‌రెడ్డి, ఎనగందుల శ్రీకాంత్, దాసరి పోచమల్లు, జూల రవి, నూతి శ్రీనివాస్, ఎనగంటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నిలిచిన దోభీ సేవలు

- వేతనాలు చెల్లించాలని డిమాండ్
- విధులు బహిష్కరించిన సిబ్బంది



ఆస్పత్రి ఆవరణలోని దోభీఘాట్ కేంద్రం

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో సిబ్బంది విధులు బహిష్కరించారు. దీంతో మూడు రోజులుగా దోభీ సేవలు నిలిచిపోయాయి. మూడేళ్లుగా సిబ్బందికి వేతనాలు రావడం లేదని, దీంతో ఆస్పత్రి ఆవరణలోని దోభీఘాట్ కేంద్రానికి తాళాలు వేశామని సిబ్బంది తెలిపారు. ఈమేరకు విధులు బహిష్కరించారు. తనకు ప్రభుత్వం నుంచి మూడేళ్లుగా బిల్లులు విడుదల కావడం లేదని, జీజీహెచ్ నుంచి మరో 11 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని దోభీ కేంద్రాన్ని నిర్వహించే కాంట్రాక్టర్ తెలిపారు. మరోవైపు.. సిబ్బంది నియామకం కోసం అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారని, ఇంతకాలం పనిచేస్తున్న తమను వారధి నుంచి విధుల్లోకి నేరుగా తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. దోభీ కార్మికులకు జీతాలు చెల్లించేలా చొరవ తీసుకోవాల్సిన అధికారులు, ఇతరులతో ఆస్పత్రిలోని దుస్తులను ఉతికిస్తున్నారని, దీంతో తమ జీవనోపాధిని కోల్పోయేలా అధికారులు వ్యవహరించడం సరికాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, దోభీ సేవలు నిలిచిపోవడంతో ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీలకు ఉపయోగించిన బట్టలు, వైద్యులు ధరించిన ఆప్రాన్లు, వార్డుల్లోని బెడ్‌షీట్లు, టవల్స్‌ను సకాలంలో ఉతకకపోవడంతో అవి పేరుకుపోతున్నాయి. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకొని తమ సమస్య పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.

కొనసాగుతున్న బీ థర్మల్ షట్‌డౌన్ పనులు

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల బీ థర్మల్ విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఏటా వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఈప్రక్రియ చేపడతారు. అయితే, గరిష్ఠంగా 15రోజుల్లో సాంకేతిక ఓవర్‌హాలింగ్ పనులు పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకొస్తారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 12న షట్‌డౌన్ చేసిన ఇంజినీర్లు, అధికారులు.. టర్బయిన్, బాయిలర్ విభాగాల్లో ఓవర్ హాలింగ్ పనులు పూర్తిచేశారు. అయితే, మిల్స్ గేర్‌బాక్స్‌లో తరచూ సాంకేతిక లోపం తలెత్తుతోంది. విద్యుత్ కేంద్రం ఉత్పత్తి దశలోకి వచ్చేందుకు ఇంకో వారంరోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా, నెల రోజులుగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో సంస్థకు సుమారు రూ.18కోట్లు నష్టం వచ్చినట్లు చెబుతున్నారు. కేంద్రంలో రోజూ 40 మెగావాట్ల సామర్థ్యంతో పది లక్షల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. ఒక్కో యూనిట్ ధర రూ.6గా పరిగణిస్తే.. ఇప్పటి వరకు థర్మల్ కేంద్రం రూ.18 కోట్ల ఆదాయం నష్టపోయిందని వారు వివరిస్తున్నారు.

ఆయన తూర్పు.. ఈయన పడమర

- ముత్తారం నుంచే ఇద్దరు నేతల ప్రచారం షురూ
- సెంటిమెంట్ కలిసొచ్చేదెవరికో..!



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



పాదయాత్రలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

సాక్షి, పెద్దపల్లి: వారిద్దరూ రాజకీయాల్లో తూర్పుపడమరలు. ఒకరు కాంగ్రెస్ పార్టీ నేత అయితే.. మరొకరు బీఆర్‌ఎస్ నాయకుడు. కానీ వారిద్దరికీ సెంటిమెంట్ ముత్తారం కేంద్రంగా ఎన్నికల ప్రచారం షురూ చేయడం. వారే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు. ఇటీవల బీఆర్‌ఎస్ టికెట్ ఖరారు కావడంతో పుట్ట మధు ముత్తారం కేంద్రంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా పాదయాత్ర ప్రారంభించారు. తూర్పువైపు ఉన్న మండలాల్లో తన పాదయాత్ర కొనసాగించి నియోజకవర్గం చుట్టివచ్చారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సైతం ముత్తారం కేంద్రంగా భారీసభ నిర్వహించి పడమర దిశగా తన ప్రచారం మొదలు పెట్టారు. ఈ ఇద్దరు నేతలు ముత్తారం సెంటిమెంట్‌గా ఎన్నికల ప్రచారం ఇక్కడి నుంచే ప్రారంభించినా.. ఎవరికి కలిసివస్తుందోనని నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

మోహన్‌రెడ్డి నేత్రాలు సజీవం


గంట మోహన్‌రెడ్డి (ఫైల్)

రామగిరి: కల్వచర్ల గ్రామానికి చెందిన గంట మోహన్‌రెడ్డి (90) గురువారం రాత్రి అనారోగ్య సమస్యలతో మరణించాడు. ఆయన కుమారుడు, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, కోడలు, కల్వచర్ల సర్పంచ్ గంట పద్మ సమాజహితం కోసం మోహన్‌రెడ్డి కళ్లు దానం చేయాలని నిర్ణయించారు. దీంతో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నూక రమేశ్, సీహెచ్ లింగమూర్తి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా నేత్రాలను సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. కుటుంబ సభ్యుడిని కోల్పోయిన దుఃఖంలో కూడా నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన ఆయన కుటుంబ సభ్యులను గ్రామస్తులు, సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

ఏకగ్రీవ ఎన్నిక


క్రాంతికుమార్

యైటింక్లయిన్‌కాలనీ: ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ గురుకుల పాఠశాలల పేరెంట్స్ కమిటీ(టీజీపీఏ) అసోసియేషన్ జిల్లా మీడియా ఇన్‌చార్జిగా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన బాదే క్రాంతికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌ప్రభూ శుక్రవారం తెలిపారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రాంతి కుమార్‌కు ఎన్నిక అందజేశారు.

గీతకార్మికుడి మృతి

మంథని: గుంజపడుగు గ్రామానికి చెందిన గీతకార్మికుడు కోండ్ర సతీశ్ శుక్రవారం మృతి చెందాడు. ఈనెల 4న ఈతచెట్టు పైనుంచిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెన్నుముక సమస్య తీవ్రం కావడంతో చికిత్స చేయించుకొని ఇంటికి చేరాడు. శుక్రవారం హఠాత్తుగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

న్యాయం, ధర్మాన్ని గెలిపించండి

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో న్యాయం, ధర్మాన్ని గెలిపించాలని జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి కోరారు. శుక్రవారం ఇంటింటికీ, గడప గడపకూ ప్రచారంలో భాగంగా ఫైవింక్లయిన్ ఏరియాలో పాదయాత్ర నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంషీర్, దాముఖ ఉదయ్, శ్రీనివాస్, పాషా, అన్వర్, శ్రీను, షమీం తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో 17మంది బైండోవర్

పాలకుర్తి(రామగుండం): వివిధ గ్రామాలకు చెందిన 17మందిని స్థానిక తహసీల్దార్ జ్యోతి ఎదుట బైండోవర్ చేసినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ రమేశ్ తెలిపారు. ఇందులో 13మంది బెల్ట్‌షాపు నిర్వాహకులు, ఇద్దరు గుడుంబా విక్రయదారులు, మరో ఇద్దరు బెల్లం, పటిక అక్రమ రవాణాదారులని వివరించారు. వచ్చే ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగడానికి అందరూ సహకరించాలని సీఐ కోరారు.

ఓదెలలో..

ఓదెల(పెద్దపల్లి): వివిధ గ్రామాల్లోని నలుగురిని తహసీల్దార్ యాకన్న ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్లు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. వారి ప్రవర్తన సరిగా లేనందున బైండోవర్ చేసినట్లు వివరించారు.

వివాహేతర సంబంధమే కారణం

- భర్తను హత్య చేయించిన భార్య
- నిందితురాలితోపాటు ఐదుగురి అరెస్ట్
- పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడి


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న డీసీపీ వైభవ్‌గైక్వాడ్

గోదావరిఖని: ఓ మహిళతో వివాహేతర సంబంధం నెరపుతూ, సొమ్మంతా ఆమెకే వెచ్చిస్తున్నాడనే కోపంతో ఐదుగురితో కలిసి ఓ భార్య తన భర్తను హతమార్చిందని డీసీపీ వైభవ్‌గైక్వాడ్ వెల్లడించారు. గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన కొచ్చెర ప్రవీణ్(42)ను అతడి భార్య కొచ్చెర లలిత (34), రామగుండం హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన మచ్చ సురేశ్(37), ఇందారపు సతీశ్(25), మందమర్రికి చెందిన నన్నపరాజు చంద్రశేఖర్(38), లారీ క్లీనర్ భీమ గణేశ్(23), లారీ డ్రైవర్ మాసు శ్రీనివాస్(33) ఈ హత్య కేసులో ప్రధాన నిందితులని వివరించారు. గోదావరిఖనిలో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, బిల్డర్‌గా అతితక్కువ సమయంలో ఎదిగిన ప్రవీణ్‌ను పథకం ప్రకారం చంపారని తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విలేకరిగా తన ప్రస్థానం ప్రారంభించిన ప్రవీణ్.. మందమర్రి ప్రాంతానికి చెందిన లలితను 15ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వ్యాపార రీత్యా పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఇతడికి గోదావరిఖని ప్రాంతానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈక్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. వీటిని మర్చిపోయేందుకు ప్రవీణ్ మద్యం తాగి ఇంటికి వెళ్లేవాడు. ఈపరిణామాలతో విసిగిపోయిన భార్య లలిత.. తన భర్తను వదిలించుకోవాలని పథకం రచించింది. ఈక్రమంలో సెంట్రింగ్ పనుల కోసం ఇంటివద్దకు వచ్చే సురేశ్‌కు తన సమస్య విన్నవించి, తన భర్తను చంపేందుకు సాయం చేయాలని కోరింది. హత్య కేసులో ఇరుక్కుంటే తన కుటుంబం ఇబ్బంది పాలవుతుందని సురేశ్ చెప్పడంతో ఒకఫ్లాట్ రాసి ఇస్తానని లలిత ఒప్పందం చేసుకుంది. తొలుత ఎవరికీ అనుమానం రాకుండా మద్యం మత్తులో నిద్రిస్తున్న ప్రవీణ్ ముఖంపై దిండు పెట్టి చంపాలని నిర్ణయించుకున్నారు. అయినా చనిపోకపోతే పాముతో కాటేసి చంపించి సహజ మరణంగా చిత్రీకరించాలని చూశారు.

సొమ్ము చెల్లింపు కోసం అంగీకారం..

లలిత, మచ్చ సురేశ్ ఇద్దరూ కలిసి ప్రవీణ్‌ను అంతమొందించేందుకు నిర్ణయించుకున్నారు. సాయం కోసం ఇందారం సతీశ్‌ను సంప్రదించారు. మరోమిత్రుడు మందమర్రికి చెందిన మాస శ్రీనివాస్‌ను సంప్రదించి పాములు పట్టే వ్యక్తి కావాలని కోరారు. అందుకు శ్రీనివాస్ అంగీకరించి తనకు పరిచయం ఉన్న భీమ గణేశ్ ద్వారా మందమర్రి ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు నన్నపు రాజు చంద్రశేఖర్‌ను సంప్రదించారు. ముందుగా తన పథకాన్ని అమలు చేసేందుకు కొంతడబ్బు కావాలని కోరగా తనవద్ద ఉన్న 34గ్రాముల బంగారు గొలుసు సురేశ్‌కు ఇచ్చి దాన్ని అమ్మిఖర్చులకు ఉపయోగించుకోవాలని లలిత సూచించింది.

పాముతో కాటు వేయించి..

ఈనెల 9న పాము అందుబాటులో ఉందని చంద్రశేఖర్ ఫోన్‌ద్వారా మచ్చ సురేశ్‌కు సమాచారం ఇచ్చాడు. ఆరోజే కొచ్చెర ప్రవీణ్‌ను అంతమొందించేందుకు నిర్ణయించారు. ఈక్రమంలో అందరూ రామగుండంలో కలిసి మద్యం తాగుతూ లలితతో ప్రవీణ్ కదలికల గురించి తెలుసుకుంటూ ఉన్నారు. అతను నిద్రకు ఉపక్రమించిన తర్వాత లలిత ఈ విషయాన్ని నిందితులకు తెలియజేసింది. దీంతో మచ్చ సురేశ్, అతడి అనుచరులు రెండు బైక్‌లపై ప్రవీణ్ ఇంటికి చేరుకున్నారు. వారిరాకకోసం ఎదురుచూస్తున్న లలిత.. ఇంటిముందున్న ప్రధాన ద్వారాలు తెరిచి ఉంచి ఇంట్లోకి ఆహ్వానించింది. పడకగదిలో నిద్రిస్తున్న ప్రవీణ్‌ను చూపించింది. తాను మరో గదిలో కూర్చుంది. ఈక్రమంలో సురేశ్ చద్దరుతో ప్రవీణ్‌ముఖం, ముక్కుపై అదిమిపట్టి శ్వాసఆడకుండా చేయగా అతడి అనుచరులు ఇందారపు సతీశ్, భీమ గణేశ్, మాస శ్రీనివాసు.. ప్రవీణ్ కాళ్లు, చేతులు గట్టిగా అదిమిపట్టుకుని మచ్చ సురేశ్‌కు సహకరించారు. ఒకవేళ ఇలా చనిపోకపోతే పాము కాటుతో చంపేయాలని తన మిత్రుడు చంద్రశేఖర్ సాయంతో పాము కాటు వేయించాడు. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత మచ్చ సురేశ్, అతడి మిత్రులు అక్కడి నుంచి పరారయ్యారు. పామును గోదావరి బ్రిడ్జి దాటిన తర్వాత అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఆ తర్వాత లలిత తన భర్త సాధారణంగానే మరణించినట్లు చిత్రీకరించేందుకు యత్నించింది. గుండెనొప్పితో చనిపోయినాడని ఇరుగుపొరుగువారికి చెప్పింది. శవాన్ని ఫ్రీజర్‌లో పెట్టి అంతిమసంస్కారాలకోసం ఉంచింది.

తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి..

ప్రవీణ్ తల్లి ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు రంగప్రవేశం చేశారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. అనుమానం రావడంతో భార్యను విచారించడంతో వాస్తవాలు వెలుగులోకివచ్చాయి. తానే హత్య చేయించినట్లు ఆమె ఒప్పుకుంది. ఈమేరకు నిందితులను అరెస్ట్ చేసి, వారినుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు మొబైల్‌ఫోన్లు, 34గ్రాముల బంగారు చైన్‌స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వివరించారు. సమావేశంలో సీఐ ప్రమోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి


మాట్లాడుతున్న సింగం సత్తయ్యగౌడ్

రామగుండం: ప్రభుత్వాలు గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్య గౌడ్ కోరారు. శుక్రవారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గీత కార్మిక సొసైటీకి ఈత, తాటిమొక్కల పెంపకానికి జీఓ.నెం .560 ప్రకారం పదెకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని, నీటి సౌకర్యం కల్పించాలని, కార్మికుడు మృతిచెందితే రూ.పది లక్షలు, గాయపడితే రూ.ఐదు లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. బెల్ట్‌షాపులను మూసివేయించాలని, జిల్లా, మండల కేంద్రాల్లో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేసి గీత సొసైటీలకు అప్పగించాలని, వ్యవసాయ సహకార పరపతి సంఘాల మాదిరిగా గీత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సైదాపూర్ గుట్టల సంపద విస్తరించిన కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట అటవీ సహజ సంపద కాపాడాలని విన్నవించారు. ఈ సమావేశంలో ప్రతినిధులు సంపునూరి మల్లేశంగౌడ్, కోల లక్ష్మణ్‌గౌడ్, మూల మల్లేశంగౌడ్, బూర్గు రాజేశంగౌడ్, ఎం.బాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం అభిషేకం


అభిషేకం చేస్తున్న పండితులు

మంథని: స్థానిక శ్రీబిక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. పట్టణంలో ఐదు ప్రధాన శివాలయాలు ఉన్నాయి. అమావాస్యకు ముందువచ్చిన మాసశివరాత్రి సందర్భంగా శ్రీబిక్షేశ్వర స్వామి ఆలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దక్షిణ భారతదేశంలోని పశ్చిమ ముఖద్వారం కలిగిన ఏకైక శివాలయంగా బిక్షేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. లోకకల్యాణార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వేద పండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓజ్జల గణేశ్‌శర్మ, నల్లగొండ వెంకన్నశర్మ, శ్రీరాంభట్ల ఆదిత్యశర్మ, రంగి రాజన్నశర్మ, పల్లి సంజీవ్‌శర్మ, మహావాది విజయకుమార్‌శర్మ, తనువుల శ్రీవత్సశర్మ, మహావాది శివకుమార్‌శర్మ, డింగిరి హరిశర్మ, దహగం త్రయంబక్‌శర్మ, నచ్చుగారి స్వజన్‌శర్మ, యజ్ఞంపట్ల శ్రీకాంత్‌శర్మ, డింగిరి అభిరాం శర్మ, రామ్‌చరణ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 102 పైలట్ దుర్మరణం


వెంకటేశ్ (ఫైల్)

మానకొండూర్: ఓ కారు ఢీకొన్న ఘటనలో 102 వాహన పైలట్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి పంచాయతీ పరిధి లస్మయ్యపల్లికి చెందిన దాసరి వెంకటేశ్(31) 102 వాహన పైలట్‌గా కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి డ్యూటీ ముగించుకొని, శుక్రవారం ఉదయం బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఈదులగట్టిపల్లి శివారులోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై కరీంనగర్ వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని, మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సామాన్యులకు న్యాయం


కాంగ్రెస్ హామీలను వివరిస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దొంగతుర్తిలో శుక్రవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ, రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్.. సామాన్యులను విస్మరించి బడాబాబులకు లబ్ధి చేకూర్చిందని ఆరోపించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన దాదాపు వంద మంది యువకులు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందం మహిపాల్, బీసీ సెల్ అధ్యక్షుడు అశోక్, నాయకులు రవి, శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మక్కాన్‌సింగ్‌ఠాకూర్

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్, సోమనపల్లికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ, బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ, బ్రాహ్మణపల్లి లోతట్టు వంతెన నిర్మాణం, ఐటీ పార్క్, అపరిష్కృతంగా టెక్స్‌టైల్ భూసమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్షణమే వీటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ రాజ్యం రావాలి


మాట్లాడుతున్న మహేశ్

మంథని: ఇందిరమ్మ రాజ్యం ద్వారానే ఇంటింటికీ రక్ష అని, అందుకోసమే మంథని నియోజకవర్గంలో ఎంతోమంది బలహీనవర్గాలకు అండగా ఉంటున్న శ్రీధర్‌బాబును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయమాటలతో ప్రజల్ని మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. నాయకులు గోటికార కిషన్, ఐలి శ్రీనివాస్, మాచిడి రవితేజగౌడ్, అల్లం కుమారస్వామి, బండారి సదానందం, బండారి ప్రసాద్, గట్టు విజయ్, నాగుల రాజయ్య ఊరకొండ గణేశ్, గడ్డం రాజాగౌడ్, కోరబోయిన కృష్ణవంశీ, తాళ్లపల్లి సత్యనారాయణ, ఎండీ సాహిబ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బండిపెల్లి బాలరాజు మృతి తీరనిలోటు


నివాళి అర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: సీపీఐ సీనియర్ నాయకుడు, రిటైర్ ఆర్టీసీ ఉద్యోగి బండిపెల్లి బాలరాజు మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరనిలోటని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. బాలరాజు కుటుంబాన్ని శుక్రవారం వారి ఇంటికి వెళ్లి, పరామర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బెజ్జంకి మండలం పాపన్నపల్లికి చెందిన బాలరాజు ఆ ప్రాంతంలో సీపీఐ బలోపేతానికి కృషి చేశారన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం ఆర్టీసీలో చేరి, ఉద్యోగరీత్యా అంచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బూడిద సదాశివ, నాయకులు తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు


సీజ్ చేసిన మద్యంతో సీఐ జగదీశ్

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ జగదీశ్ హెచ్చరించారు. వివిధ గ్రామాల్లోని బెల్ట్ షాపులపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. మద్యాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయిస్తే సీజ్ చేయడంతోపాటు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై విజేందర్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి(పెద్దపల్లి): మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై ఎస్‌ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ముమ్మరంగా దాడులు నిర్వహించారు. భారీఎత్తున మద్యం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయించరాదని నిర్వాహకులకు సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: వివిధ గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన బెల్ట్ షాపుల్లో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పది దుకాణాల్లో రూ.20 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కిరణ్ తెలిపారు.

వాహనదారుకు జైలు

గోదావరిఖని: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ ముందు హాజరు పర్చగా ఈశిక్ష విధించినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డలో ఉంటున్న ఓ వివాహిత చికిత్స పొందుతూ చెందింది. కరీంనగర్ టూటౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్‌కు చిగురుమామిడి మండలంలోని బోయినపల్లికి చెందిన శ్రీదేవి(33తో 15 సంవత్సరాల కింద వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు అన్నారు. శ్రీదేవి ఆరు నెలలుగా విడిగా కరీంనగర్‌లో అద్దెకు ఉంటోంది. ఆమె అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఈ నెల 11న రాత్రి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయం

చొప్పదండి: గుమ్లాపూర్‌లో శుక్రవారం కుక్క దాడిలో ఓ చిన్నారికి గాయమైంది. సెలవులు కావడంతో కదారి గంగరాజు కూతురు ఇంటి వద్ద తన స్నేహితులతో ఆడుకుంటోంది. అటుగా వచ్చిన కుక్క పాప కాలిని కొరకడంతో గాయమైంది. మిగతా పిల్ల లు కేకలు వేయడంతో పారిపోయింది. కుటుంబసభ్యులు చిన్నారికి స్థానికంగా చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైంది.

బొగ్గు బాయి

గుర్తింపు సంఘం కార్మికులకు చేసింది శూన్యం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ కార్మికులకు చేసింది శూన్యమని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం జీడీకే-2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు ఐఎన్‌టీయూసీ చేసే పోరాటాలకు కలిసిరావాలని కోరారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. వారు కేవలం పైరవీలు, మెడికల్ అన్‌ఫిట్ దందాలకే పరిమితమయ్యారని ఆరోపించారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ప్రతీపని ఎమ్మెల్యే, ఎంపీల సిఫారసుతోనే యాజమాన్యం చేస్తోందన్నారు. శ్రీరాంపూర్ సాక్షిగా కేసీఆర్ ఇచ్చిన హామీలు, మారుపేర్ల మార్పు, 10నూతన బొగ్గు గనుల ప్రారంభం, 10 వేల నూతన క్వార్టర్ల నిర్మాణం వంటివి అమలు కాలేదన్నారు. సింగరేణిలో 92 వేల కార్మికులు ఉన్నప్పుడు 2,400 అధికారులు ఉంటే ఇప్పుడు 43 వేల కార్మికులు ఉన్నా, అధికారుల సంఖ్య పెరగడం ఏమిటని ప్రశ్నించారు. కాగా, గని ఫిట్ సెక్రటరీగా సిరిపురం నర్సయ్యను నియమించారు. నాయకులు ధర్మపురి, దేవులపల్లి రాజేందర్, ఆరెపల్లి శ్రీనివాస్, కె.సదానందం తదితరులు పాల్గొన్నారు.

రామగుండం ఐఎన్‌టీయూసీకే ఇవ్వాలి

రామగుండం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్ ఐఎన్‌టీయూసీకే ఇవ్వాలని జనక్‌ప్రసాద్ కోరారు. గేట్ మీటింగ్ తర్వాత శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఐఎన్‌టీయూసీకి మంచిపట్టు ఉందని, కాంగ్రెస్ టికెట్ ఐఎన్‌టీయూసీకి ఇస్తే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన అన్నారు.

జీడీకే-11గనిలో కార్మికుడికి గాయాలు


పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధి జీడీకే-11గనిలో బుల్లెట్ షిఫ్ట్‌లో ప్రమాదం జరిగి కార్మికుడు గాయపడ్డాడు. 75 లెవల్లో ప్రమాదం జరిగి జనరల్ మజ్దూర్ కార్మికుడు రామకృష్ణ తలకు గాయాలయ్యాయి. అతడిని వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేబుల్‌ను రాడ్‌తో సవరిస్తుంగా.. రివర్స్‌వచ్చి బలంగా తాకడంతో తలకు గాయాలయ్యాయి. ప్రమాదమేమి లేదని డాక్టర్లు తెలిపారు. కాగా సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, నాయకులు కార్మికుడిని పరామర్శించారు.

రెస్క్యూ పోటీల విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు


అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్

రామగిరి: మైన్స్ రెస్క్యూ పోటీల్లో మొదటిస్థానం సాధించిన ఆర్జీ-3 అండ్ ఏపీఏ రెస్క్యూ బృందాన్ని జీఎం వెంకటేశ్వర్లు శుక్రవారం అభినందించారు. ఏపీఏ గనికి చెందిన కె.అనిల్ కుమార్ కెప్టెన్‌గా, పవన్, శ్రీకాంత్, అలీ, రాకేశ్, తిరుపతి, శ్యామ్ సభ్యులగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. జీఎం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, రెస్క్యూ ఇన్‌చార్జి మాధవరావు, ప్రాజెక్టు ఇంజినీర్ టి.రఘురాం, మేనేజర్ కె.జనార్దన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖని: 52వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ మూడోస్థానం సాధించిన ఆర్జీ-1 రెస్క్యూ బృందాన్ని జీఎం చింతల శ్రీనివాస్ శుక్రవారం అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి ఏరియాకు మంచిపేరు తేవాలని సూచించారు. ఇదేటీం నుంచి పరమేశ్వర్, శ్రీకాంత్, నాగరాజు ఆలిండియా రెస్క్యూ పోటీలకు ఎంపిక కావడంపై ఆయన అభినందనలు తెలిపారు. పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, అధికారులు ఆంజనేయులు ఉన్నారు.

'ప్రమాదాలు జరుగుతున్నాయి'

రామగిరి: ఏపీఏ గనిలో కార్మికులను ఒత్తిడికి గురిచేస్తుడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆర్జీ-3 డివిజన్ ఏపీఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. యాజమాన్యం కార్మికుల రక్షణ చర్యలను విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్‌రావు, బ్రాంచ్ సెక్రటరీ బండారి క్రాంతి, ఆర్జీ-3 డివిజన్ కార్యదర్శి మహ్మద్ ఇస్మాయిల్, గొశిక అశోక్, రంజిత్, సత్యనారాయణ, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.

జీడీకే-5 ఓసీపీలో తెగిన విద్యుత్ తీగలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-5 ఓసీపీలో శుక్రవారం రాత్రి విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఇసుకను డంప్ చేసిన డంపర్ బకెట్‌కిందకు దించకుండా ముందుకు వెళ్లడంతో తీగలు తాకింది. దీంతో వైర్లు తెగిపోయాయి. దీంతో కొద్దిసేపు గనిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అయితే, దీని ద్వారా ఎలాంటి నష్టం వాటిల్ల లేదని తెలుస్తోంది.

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు

- **కెమిస్ట్రీ ఫస్టియర్:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్ ఫస్టియర్:** ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్ సెకండియర్:** పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియోమీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

"సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే." – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ

బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్‌అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్క డి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన 'ఊపిరి' నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన ఆస్త్రల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు 'సుద్దాల' పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజా గాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు– జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, 'మోదుగుపూలు' ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

'బీ థర్మల్' మనుగడ ప్రశ్నార్థకం

- జీవితకాలం ముగిసి 25ఏళ్లు
- ఆధునికీకరణకు నోచాన్స్
- కొత్త ప్రాజెక్టు ఏర్పాటే ప్రత్యామ్నాయం

రామగుండం: 62.5 మెగావాట్ల సామర్థ్యం గల రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. విద్యుత్ కేంద్రాల జీవితకాలం పాతికేళ్లే అని జెన్‌కో డైరెక్టర్లు ఇటీవల స్పష్టం చేయడంతో అది కాలంచెల్లిన జాబితాలో చేరినట్లయ్యింది.

1965లో శంకుస్థాపన..

- రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీపీ)కి అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 1965 జూలై 19న శంకుస్థాపన చేశారు.
- రూ.రూ.14.8 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు జవహర్‌లాల్ నెహ్రూ థర్మల్ విద్యుత్ కేంద్రంగా నామకరణం చేశారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఇది తొలి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం.
- అయితే, స్థానికంగా వనరుల లభ్యత సమృద్ధిగా ఉండడంతో కొత్తగా 800 మెగావాట్ల సామర్థ్యం మరో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది.
- దీనిద్వారా నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

కాలంచెల్లిన జాబితాలో..

- పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా 200 మెగావాట్లలోపు 25 ఏళ్లపైబడి జీవితకాలం ఉన్న విద్యుత్ కేంద్రాలను కూల్చి, వాటిస్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అధికారాన్ని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి అప్పగించింది. దీంతో కొత్తగూడెంలో ఐదు యూనిట్లను ఇటీవల కూల్చివేసి కొత్తవి స్థాపించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఢిల్లీలోని సీఈఏ చైర్మన్‌ను ఇటీవల కలిశారు. బీ–థర్మల్‌ను సీఈఏ నామ్స్‌కు లోబడి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, పారామీటర్స్ అంశాలు వివరించారు. దీంతో సీఈఏ గడువు పొడిగించింది.



బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

తరచూ సాంకేతిక సమస్యలు..

- కాలంచెల్లిన ప్రాజెక్టు కావడంతో బాయిలర్ ట్యూబ్స్, మిల్స్, టర్బయిన్ విభాగాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.
- ప్రతీసారి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది.
- పునరుద్ధరణకు విడిభాగాలు లభ్యం కావడం లేదు.
- స్థానిక సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరిస్తున్నా కొద్దిరోజులకే మళ్లీ సమస్యలు తలెత్తుతున్నాయి.
- విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ తర్వాత మళ్లీ ఆయిల్ మండించి బాయిలర్ స్టార్టప్ చేసేందుకు సుమారు రూ.20లక్షల వ్యయం అవుతోంది.
- ఇలా ఏటా సుమారు 30సార్లు షట్‌డౌన్ కావడంతో పునరుద్ధరణకే రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తోంది.

కొత్త విద్యుత్ కేంద్రం స్థాపనకు అనుకూలతలు..

- బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం తొలగించి, అదే స్థలంలో 500 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త పరిశ్రమ ఏర్పాటు చేసే వీలుంది. ఇందుకు అవసరమైన స్థలం, ఇతర వనరుల లభ్యతపై నాలుగేళ్ల క్రితమే జెన్‌కో సర్వే చేసింది. మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 0.7 ఎకరాలు అవసరమూతే.. 500 మెగావాట్ల ప్రాజెక్టుకు 350 ఎకరాలు(ఉద్యోగుల వసతి గృహాలతో కలుపుకొని)అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఏ- కాలనీ నుంచి సీ- కాలనీ అతిథి గృహం వరకు 44.5 ఎకరాలు, ఏ, బీ, సీ కాలనీలతోపాటు పెద్దచెరువు, విద్యుత్ కేంద్రం స్థలంతో కలుపుకొని 390 ఎకరాలు ఉన్నట్లు గుర్తించింది. వీటితో పాటు బూడిద చెరువు 127 ఎకరాలు, వాటర్ రిజర్వాయర్లు ప్లాంట్‌లోని ఖాళీ ప్రదేశాన్ని కలుపుకొని మరో 400 ఎకరాలు ఉన్నట్లు తేల్చారు. ఐదు వందల ఎకరాల విద్యుత్ కేంద్రానికి 100 ఎకరాల బూడిద చెరువు సరిపోతుందని, ప్రస్తుతం బూడిద చెరువు 125 ఎకరాల విస్తీర్ణంలో ఉందని నివేదిక రూపొందించింది.

తక్కువ ధరకే అందుబాటులోకి..

స్థానికంగా నీరు, బొగ్గు అందుబాటులో ఉంది. దీంతో రవాణా ఖర్చు తగ్గుతుంది. తద్వారా విద్యుత్ తక్కువ ధరకే లభ్యమవుతుంది. దీనిమీపంలోనే ఓపెన్‌కాస్టు బొగ్గు గనులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీరు, విద్యుత్ కేంద్రం లోపలి వరకు ఇప్పటికే రోడ్డు, రైలు మార్గం.. ఇలా అన్నీ అనుకూలంగా ఉన్నాయి. తద్వారా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి సాధ్యమని ఇంజినీర్లు చెబుతున్నారు.

కొత్తది స్థాపించాలి



బీ థర్మల్ విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని, సాధ్యం కాకుంటే కొత్త పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే దీక్షలు చేశాం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
– కౌశిక హరి, కార్మిక సంఘం ప్రతినిధి

అందుబాటులో వనరులు



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి బీ–థర్మల్ స్థలంలో స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని కొత్త విద్యుత్ కేంద్రం స్థాపించాలి. తద్వారా రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగవించవచవచ్చు. – కన్నూరి సతీశ్‌కుమార్, విద్యుత్ కేంద్రం సాధన సమితి చైర్మన్

ముస్తాబైన రాజన్న ఆలయం



వేములవాడ: రాజన్న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

చకచకా శరన్నవరాత్రి ఏర్పాట్లు

- ముస్తాభైన బాసర ఆలయం
- బారికేడ్లు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది
- ఆలయం ముందు మొరం పోయిస్తున్న అధికారులు
- కోనేరు శుద్ధి చేయాలంటున్న భక్తులు
- రేపటి నుంచే శరన్నవరాత్రి ఉత్సవాలు



బాసర ఆలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు



రాళ్లు తొలగించి మొరం పోస్తున్న దృశ్యం

భైంసా: బాసరలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. దసరా వరకు కొనసాగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆహ్వానాలు పంపించారు. ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ పెద్దలకు ఆలయ అర్చక బృందం ఆహ్వానాలు ఇచ్చి ఉత్సవాలకు రావాలని కోరారు. ఇక యేట బాసరలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు లక్షలాది భక్తులు వస్తుంటారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాసాల సంఖ్య అధికంగా ఉంటుంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఈయేడు కూడా ఆలయ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు దొర్లకుండా, భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

క్యూలైన్లు ఏర్పాట్లు...

బాసర ప్రధాన ద్వారం, ఆలయం, ఆలయ ప్రాంగణం, పరిసరాలు, వేదవ్యాస గుడి ఇలా అన్ని చోట్ల ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. టీటీడీ సత్రం నుంచే స్వాగతతోరణం ఏర్పాటుచేసి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అక్షరాభ్యాసాలు జరిపించి బయటకు వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

మొరం వేసి...

వసతిగృహాలు, ప్రసాద కౌంటర్‌కు మధ్య బండ రాళ్ల గుట్ట ఉండేది. కొన్ని రోజులుగా ఈ పనులను పూర్తిచేసి బండరాళ్లు తొలగించేశారు. వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ఇక్కడ టిప్పర్లతో మొరం వేయించి చదును చేయిస్తున్నారు.

రంగుమారిన కోనేరు నీరు...

బాసర ఆలయానికి ఆనుకుని కోనేరు ఉంది. వ్యాస మహర్షి ఆలయం బాసర సరస్వతీ ఆలయం మధ్య ఈ కోనేరు కనిపిస్తుంది. చుట్టూ గార్డెన్ ఉండడంతో కోనేరు ఉందన్న విషయం తెలియడంలేదు. 20 ఏళ్ల క్రితం బాసర వచ్చేవారంతా ఈ కోనేరులోనే స్నానాలు చేసేవారు. రానురాను కోనేరు మార్గం మూసి పచ్చని గడ్డి, చెట్లు పెంచారు. వచ్చిన భక్తులంతా నేరుగా ఆలయానికే వెళ్తున్నారు. గతంలో ఈ కోనేరులో దిగి ఇక్కడే నెత్తిపై నీళ్లు చల్లుకుని అమ్మవారి దర్శనానికివెళ్లేవారు. కోనేరు నిర్వాహణ లేక అందులో నీరంతా రంగుమారింది. దగ్గరికి వెళ్లితే పచ్చని రంగుతో కనిపించే నీటి నుంచి దుర్వాసన వస్తుంది. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కోనేటిని శుద్ధిచేయాలని భక్తులు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం

బాసర ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖులకు ఆహ్వానాలు అందించి బాసర రావాలని కోరాం. బాసర వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. బాసర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాం.
– విజయరామారావు, ఆలయ ఈవో

గోదావరి వద్ద...

బాసర గోదావరి నది వద్ద ప్రధాన స్నానఘట్టాలు ఇప్పుడిప్పుడే శుభ్రంచేస్తున్నారు. ఈయేడు గోదావరి నదిలో వరదనీటిలో నల్లమట్టి బాగా చేరింది. బాసర వంతెన నుంచి సూర్యేశ్వర స్వామి ఆలయం వరకు విశాలంగా ఉన్న స్నానఘట్టాల్లో అంతా స్నానాలుచేస్తారు. నల్లమట్టిలో కాలుజారి నీటిలో పడిపోతున్నారు. అధికారులు ఈ విషయంపై స్పందించి పూర్తిగా నల్లమట్టి తొలగించిన ఘాట్‌ల వద్దే స్నానాలుచేసేలా భక్తులకు సూచనలు ఇవ్వాలి.

ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం

- ఎన్నిక చెల్లదన్న 'పత్తిరెడ్డి' పిటిషన్‌పై హైకోర్టు విచారణ
- సంతకాల ఫోర్జరీపై ఫోరెన్సిక్ నివేదికకు ఆదేశం

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం కొనసాగుతోంది. ఈ ఎన్నిక చెల్లదని నిర్మల్ జిల్లాకు చెందిన పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. శుక్రవారం విచారణకు రాగా.. ఆ పత్రాలపై సంతకాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పోల్చి నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. 2021 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 24మంది నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా విఠల్ నిలువగా, బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పార్టీ ఆదేశాలను ధిక్కరించి నామినేషన్ వేశారు. ఉపసంహరణ రోజు 22 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తుడుందెబ్బకు చెందిన పెందూర్ పుష్పరాణి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. పోలింగ్ తర్వాత భారీ ఆధిక్యంతో విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికపై పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో విచారణ కొనసాగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పత్రాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని హైకోర్టు ఆదేశించింది. ఆ సంతకాలను పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. తాజా పరిణామాలు రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

'కడెం'ను సందర్శించిన జీఆర్ఎంబీ అధికారులు



కడెం ప్రాజెక్ట్ వద్ద అధికారులు

కడెం: కడెం ప్రాజెక్టును గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ) కార్యదర్శి అరిగేషన్, ఈఈ బత్తుల వెంకటస్వామి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్ అండర్ గ్రౌండర్ గేట్‌లను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టను సందర్శించామని తెలిపారు. ప్రాజెక్ట్ నీటి మట్టం, ప్రధాన సమస్యలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు రవికుమార్, సర్వార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారయణ తదితరులు ఉన్నారు.